# విపశ్యన మాసపత్రిక

VOLUME:25 NO - 16 1 JULY, 2019

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు - 70


## "ధర్మవాణి"

*"ఉత్తిట్ఠే నప్పమజ్జెయ్య, ధమ్మం సుచరితం చరే !*
*ధమ్మచారీ సుఖం సేతి, అస్మిమ్ లోకే పరమ్హి చ !!*
*- ధమ్మపద - లోకవగ్గో, 168*

మేల్కొనండి, ఉత్సాహవంతులు కండి, బద్ధకించకుండా సుచరిత ధర్మాన్ని ఆచరించండి. ధర్మచారి ఇహలోకంలోనూ, పరలోకంలోనూ రెండింటిలోనూ సుఖపూర్వకంగా విహారం చేస్తాడు.

# బుద్ధుని బోధనలేమిటి?

**మూడవ వ్యాఖ్యానము, రెండవ భాగం (14 అక్టోబర్ 1951)**

- శ్రీ సితు సయాజీ ఊ బా ఖిన్

(రంగూన్‌లోని పగోడా రోడ్డున కల మెథడిస్ట్ చర్చిలో ధర్మజిజ్ఞాసువుల సభలో బర్మా ప్రభుత్వ అకౌంటెంట్ జనరల్ శ్రీ సితు సయాజీ ఊ బా ఖిన్, మూడు వ్యాఖ్యానాలిచ్చారు. వాటి అనువాదాన్ని ఇక్కడ క్రమంగా ప్రచురిస్తున్నాము.) - హిందీ అనువాదకుడు, సత్యనారాయణ గోయంకా

## లోక ధాతువు మరియు ధర్మ ధాతువు

'ధాతువు' అంటే ప్రకృతిలోని మౌలిక తత్త్వాలు. వీటిని ప్రాకృతిక శక్తులు అని కూడా చెప్పుకోవచ్చు. బుద్ధుని బోధనల ప్రకారం లోకధాతువు, ధర్మధాతువుల తత్త్వాలు వేరు. లోకధాతువు అంటే భౌతిక జగత్తు యొక్క పదార్థ ప్రకృతి. ధర్మధాతువు అంటే చిత్తము, చిత్తవృత్తులు మరియు ప్రకృతిలో భౌతిక జగత్తుకు భిన్నంగా ఉన్న ఇంకొన్ని మౌలిక మానసిక తత్త్వాలు. ఆధునిక విజ్ఞానము లోకధాతువును అధ్యయనం చేసింది. మనోజగత్తులోని ధర్మధాతువుకు, లోకధాతువు కేవలం ఆధారం మాత్రమే. మానసిక జగత్తును చేరాలంటే ఇంకా ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ, అది ఆధునిక విజ్ఞాన పరిజ్ఞానంతో సాధ్యపడదు. ధర్మం యొక్క ఆచరణాత్మక జ్ఞానంతోనే అది సాధ్యపడగలదు.

"The Mature Mind" - (పరిపక్వ చిత్తము) అనే పుస్తకములో రచయిత హెచ్.ఎ.ఓవర్ స్ట్రీట్ (ప్రకాశకులు W.W. నార్టన్ అండ్ కం., న్యూయార్క్), పరిపక్వ చిత్తము గల వారి భవిష్యత్తు పట్ల ఎంతో ఆశాజనకంగా వ్రాసారు. వారు ఇలా అంటారు - " జ్ఞాన క్షేత్రంలో ఈ శతాబ్దంలో మనోవిజ్ఞాన శాస్త్రము విశిష్టంగా వికసించింది. భౌతిక-రసాయన శాస్త్రాల్లోని గొప్ప అద్భుతాలను సహితం ప్రాచుర్యంలోనున్న పరిశోధనా విధానాల ఆధారంగానే సాధించారు. కానీ, ఈనాడు మానవ స్వభావం గురించి, మరియు మానవ అనుభూతుల గురించి, (అంటే ఆధ్యాత్మికత గురించి) ఏర్పడిన దృష్టికోణం వినూత్నమైనది."

"ఇటువంటి దృష్టికోణం వికసించగలిగేందుకు పూర్వం తగిన నేపథ్యం తయారవ్వాల్సిన అవసరం ఉండింది. సుదీర్ఘ కాలం పాటు విజ్ఞానక్షేత్రంలో జరుగుతూ వచ్చిన పరిణామక్రమం ఆధారంగానే ఈ దశకు చేరుకున్నాం. కాలక్రమంలో, మనోవిజ్ఞానము ఆవిర్భవించేందుకు పూర్వమే శరీర విజ్ఞానము పరిణతి చెంది ఉండాలి. ఎందుకంటే, వ్యక్తి మానసికతలో కూడా శరీరధర్మం యొక్క ప్రమేయం ఉంటుంది గనక."

"అతని మనసును ప్రభావితం చేసే విషయాలలో, అతడి మెదడు, నాడులు, గ్రంథులు మరియు ఇంద్రియాల (స్పర్శ, వాసన, చూపు మొదలైనవాటి) వంటి భౌతిక విషయాలు కూడా ఉంటాయి. డెబ్భై సంవత్సరాల క్రితం వరకూ శరీరధర్మ శాస్త్రంలో సాధించిన పురోగతి ఆసరా అందించకుంటే ఈనాడు సుప్రసిద్ధులైన జర్మన్ మనోశాస్త్రవేత్త విల్లియం వుంట్ వంటి వారి పరిశోధనశాలల్లో మనస్సు - శరీరాల పరిశోధన సాధ్యమయ్యేది కాదు."

"శరీరధర్మవిజ్ఞానం ఆవిర్భవించటానికి ముందు జీవవిజ్ఞానం అభివృద్ధి చెంది ఉండాలి. ఎందుకంటే మెదడు, నాడులు, నరాలు, గ్రంథులు మొదలైనవి పని చేయాలంటే అవి జీవకణాల్లోని జీవచర్యలపై ఆధారపడతాయి. అందుకే నాణ్యమైన శరీరధర్మవిజ్ఞానం ఉదయించే కంటే ముందు జీవకోశవిజ్ఞానం పరిపక్వం చెందాల్సి ఉంటుంది."

"కానీ జీవవిజ్ఞానం కంటే ముందు రసాయన శాస్త్రం, దానికంటే ముందు భౌతికశాస్త్రం, దానికంటే ముందు గణితశాస్త్రం అభివృద్ధి చెందాలి. కాబట్టి ఈ సుదీర్ఘ పరిణామక్రమం ఈ దశకు చేరుకోవటానికి ఎన్నో శతాబ్దాలు పట్టింది. సంక్షిప్తంగా చెప్పాలంటే విజ్ఞాన ప్రగతి కూడా ఒక కాలచక్రాన్ని అనుసరించే జరుగుతుంది. ప్రతి విజ్ఞానశాస్త్రమూ తన సమయం కొరకు వేచిచూడాల్సిందే. ఇప్పుడు మనోవిజ్ఞానానికి సమయం వచ్చింది. ఒక నూతన జ్ఞానం ఉదయిస్తోంది."

"నిజానికి ఈ క్రొత్త విజ్ఞానం పట్ల ప్రజల్లో ఉన్న అభిరుచి ఎంతో పాతదే. కానీ కచ్చితమైన అనుసంధాన విధానాలు తయారయ్యింది ఇప్పుడే. క్లుప్తంగా, పటిష్టమైన తర్కబద్ధత ఈ విజ్ఞానాన్ని నియంత్రిస్తుంది. ప్రతి విజ్ఞానమూ తనదైన విశిష్టమైన, కచ్చితమైన యదార్థతను సంతరించుకునేది, ఆ విషయాన్ని నిర్ధారించేందుకు అవసరమైన సమాచారాన్ని, ఉపకరణాలను అందించే అంతకంటే పూర్వపు విజ్ఞానశాస్త్రాలు పటిష్టమైనప్పుడే. విజ్ఞానశాస్త్రంలో ఒక కొత్త ఘడియ వచ్చింది: ఇప్పుడొక కొత్త జ్ఞానము మన సేవకై వచ్చింది." అని చెప్పాడు.

నేను చెప్పేదేమంటే, మానవ స్వభావం యొక్క సత్యాన్ని శోధించటానికి కావలసిన అంతర్దృష్టిని పొందటానికి ప్రతి ఒక్కరూ బుద్ధుని బోధనలను అధ్యయనం చేయాల్సి ఉంది. మానవున్ని ప్రభావితం చేసే మానసిక వికారాలన్నింటి నుండీ ఉపశమనం కలిగించే ఉపాయాలు బుద్ధుని బోధనల్లో ఉన్నాయి. విశ్వమంతటా ఏర్పడిన ప్రస్తుత స్థితికి గతంలో, వర్తమానంలో చేసుకున్న అకుశల మనోవృత్తులు కారణమౌతున్నాయి. దాదాపు రెండు సంవత్సరాల క్రితం బర్మాపై పెద్ద విపత్తు వచ్చినప్పుడు ప్రజల్లో బుద్ధుని బోధనల పట్ల చెదరని విశ్వాసాన్ని కలిగించాకనే మేము ఆ సంకట స్థితి నుండి బయటపడగలిగాము.

నేడు ఎక్కడ చూసినా అసంతృప్తి వ్యాపించి ఉంది. అసంతృప్తితో దుర్భావన పుడుతుంది. దుర్భావన నుండి ద్వేషం పుడుతుంది, ద్వేషం నుండి శతృవులు తయారవుతారు, శతృవుల నుండి యుద్ధం, +యుద్ధం నుండి మళ్ళీ శతృవులు. ఈ విధంగా ఒక విషవలయం తయారవుతోంది. మరి ఇలా ఎందుకు అవుతుంది? ఎందుకంటే, మానవుడు తన మనసును తాను నియంత్రించుకోలేదు కనుక.

నిజానికి మానవుడు అంటే ఎవరు? మానవుడు, మనోవృత్తుల వ్యక్తీకరణ మాత్రమే. అదేవిధంగా పదార్థమంటే ఏమిటి? పదార్థం కూడా మనోవృత్తుల శారీరీకరణ మాత్రమే. ధనాత్మక (కుశల) మరియు ఋణాత్మక (అకుశల) కర్మల ప్రతిక్రియల పరిణామమే. భగవానుడు – ***"చిత్తేన నియ్యతితి లోకో"*** – ప్రపంచం, చిత్త సంతానమే అని చెప్పారు. కాబట్టి చిత్తమే ప్రధానమైనది, అన్నింటికంటే ఉన్నతమైనది. కాబట్టే చిత్తాన్ని మరియు దాని విశిష్ట లక్షణాలను అధ్యయనం చేసి దాని ఆధారంగా మనము ప్రపంచ సమస్యలకు తగిన సమాధానం వెతకగలము.

బుద్ధుడి బోదనల్లో వ్యావహారిక, ప్రయోగాత్మక పరిశోధనకు ఎంతో విశాల క్షేత్రం ఉంది. మా అనుభవాలతో లాభం పొందాలనుకునే వారికి చిరునవ్వుతో స్వాగతం పలుకుతాం.

సజ్జనులు, నారీమణులారా! బుద్ధుడి భోధనల్లో నాకు తెలిసిన విషయాలను మీకు వివరించే ప్రయత్నం చేశాను. మీలో ఎవరికైనా ఏవైనా ప్రశ్నలుంటే వాటిని మరింత లోతుగా వివరించటానికి సిద్ధంగా ఉన్నాను. మీరు నా వ్యాఖ్యానాలను వినటానికి ఇష్టపడి ఇక్కడకు వచ్చినందుకు నేను మీకు కృతజ్ఞుడను. నేను ఇక్కడ ప్రవచనాలివ్వటానికి అనుమతించినందుకు ఈ చర్చి యాజమాన్యానికి కూడా మరొక్కసారి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

***సబ్బే సత్తా సుఖీ హొన్తు!***

(సమాప్తం)

# వస్త్రాభరణాల మూట

భగవాన్ గౌతమ బుద్ధుడు సమ్యక్ సంబోధిని ప్రాప్తించుకున్నాక తన మొదటి వర్షావాసాన్ని ఋషిపట్టణంలోని అభయారణ్యంలో పూర్తిచేసుకున్నారు. అక్కడే 60 మంది సాధకులను అర్హంత స్థాయి వరకూ చేరుకునేలా వారిచేత సాధన చేయించి, అర్హంతులైన ఆ 60 మందిని, బహుజనుల హిత–సుఖాల కొరకు వేర్వేరు దిక్కులకు పంపి, తాను తూర్పు దిశగా ప్రయాణమయ్యారు. మార్గంలో గయాలోని కాశ్యప బంధువులను వారి మిథ్యా కర్మకాండల నుండి ముక్తులను చేసి ముక్తిదాయినీ సాధనను నేర్పించి, తానిచ్చిన మాటను నిలబెట్టుకోవటానికి మగధ దేశ రాజుకు ధర్మాన్ని బోధించటానికి రాజగృహకు వెళ్ళారు. మగధ మహారాజు బింబిసారుడు శుద్ధ ధర్మంతో ప్రభావితుడై భగవానుని అనుచరుడయ్యాడు. బింబిసారుడు, శుద్ధోధనుడి స్నేహితుడు. శుద్ధోధన మహారాజుకు తన పుత్రుడు సాధించిన అమూల్యమైన సఫలత గురించిన సమాచారం తెలియగానే అతడు భావావేశంలో మునిగిపోయాడు. అతడు పుత్రుణ్ణి కపిలవస్తుకు రమ్మని అహ్వానించాడు. భగవానుడు ఎంతో పెద్ద సంఖ్యలో భిక్షువులను వెంటబెట్టుకుని లోకకళ్యాణం కొరకు కపిలవస్తుకి వెళ్ళారు. కపిలవస్తులోని శాక్యవంశీకులు భగవానుని ఉపదేశాలతో ఎంతగానో ప్రభావితులయ్యారు. చాలా పెద్దసంఖ్యలో సద్ధర్మపథంపై నడవటానికి సంకల్పించుకున్నారు. భగవానుడు గృహస్థుడిగా ఉన్నప్పుడు అతని తమ్ముడు రాజకుమారుడు నందుడు ప్రవ్రజితుడయ్యాడు. పుత్రుడు రాహులుడు కూడా ప్రవ్రజితుడయ్యాడు.

కొద్ది రోజుల తరువాత భగవానుడు శాక్యదేశాన్ని వదిలి, దానికి దగ్గరలోని మల్లదేశం వైపుకు బయలుదేరారు. అక్కడ అనూపియా అనే పేరు గల నగరంలో కొద్దిరోజులు గడిపారు. భగవానుడు వెళ్ళిపోయిన తరువాత కూడా కపిలవస్తు నగరంలో ఆయన ధర్మోపదేశాల గురించిన చర్చ జరుగుతుండేది, ప్రజల్లో సాధన పట్ల ధర్మసంవేగం మేల్కొనేది. ఎంతోమంది శాక్యరాజకుమారులు ఇల్లూవాకిలి వదిలి భిక్షువులుగా మారి, సాధన కొరకు భగవానునితో వెళ్ళిపోయారు. మిగిలినవాళ్ళలో కూడా సద్ధర్మం పట్ల తీవ్ర ఆసక్తి తలెత్తేది. వారిలో ఆరు మంది రాజవంశీకులు మల్ల దేశానికి వెళ్లి భగవానుని శరణుపొందాలనే

నిర్ణయానికి వచ్చారు. ఆ ఆరుగురు, శాక్యరాజు భద్దీయుడు, అనిరుద్ధ రాజకుమారుడు, ఆనందుడు, భృగుడు, కింబిలుడు మరియు దేవదత్తుడు. వీరు రాజసేవకుడైన ఉపాలిని వెంటబెట్టుకుని అనూపియా నగరం వైపుకు బయలుదేరారు. ఈ ఉపాలి, ఆస్థాన క్షురకుడు. అతడు చిరకాలంగా రాజవంశీకులకు సేవచేస్తూ ఉండేవాడు. గృహస్థ సిద్ధార్థ రాజకుమారునికి కూడా జుట్టు కత్తిరించి, అలంకరించేవాడు. మార్గమధ్యలో వారికి సేవచేయటానికి రాజకుమారులు ఉపాలిని వెంటబెట్టుకుని వచ్చారు.

వారి రాజ్యం పొలిమేరలు దాటి మల్ల రాజ్యంలోకి ప్రవేశించగానే ఆరుగురు రాజపుత్రులూ వారు ధరించిన అత్యంత విలువైన దుస్తులు, ఆభరణాలు తీసివేసి ఇల్లూవాకిలి విడిచిపెట్టిన సన్యాసులలాగా సాధారణ నూలు దుస్తులు ధరించారు. ఆ విలువైన వస్త్రాలు, ఆభరణాలను ఒక మూటకట్టి మంగలి ఉపాలికి ఇస్తూ, “ఓ సేవకుడా! వీటిని నీవు తీసుకుపో, నీకూ, నీ కుటుంబ అవసరాలకు పనికొస్తుంది. వీటిని తీసుకుని ఇక నీవు తిరిగి వెళ్ళిపో. మేము ప్రవ్రజితులము కావటానికి భగవాన్ గౌతమబుద్ధుని వద్దకు వెళుతున్నాము.” అని చెప్పారు.

ఉపాలి అవాక్కయిపోయాడు. “ఇన్ని అభరణాలా! ఇవి నాకే కాకుండా నా తరువాతి మరో ఒకటి–రెండు తరాల వరకూ సరిపోతాయి.” అనుకుని ప్రసన్న చిత్తంతో యజమానులకు నమస్కరించి వెనుదిరిగాడు. అలా కొద్ది దూరం వెళ్ళిన తరువాత అతనికి తెలివొచ్చింది – “ఇంటికి తిరిగి వెళ్ళాక, రాజకుమారులను హత్య చేయించి ఈ సంపదను చేజిక్కించుకున్నాను అనే అనుమానం ప్రజల్లో కలుగుతుందేమో కదా!” అనిపించింది. “శాక్య వంశీకులు ఎంతో చండస్వభావం కలిగి ఉంటారు. ఆ అనుమానంతో నన్ను ఉరికంబమైనా ఎక్కించగలరు, లేదా నా తల తీయించేయగలరు” అని ఆలోచించాడు. వద్దు బాబూ వద్దు, అలాంటి ధనం నాకు అవసరం లేదు. నేను నా కష్టార్జితంతోనే పొట్ట నింపుకుంటాను. ఈ వస్త్రాలు, ఆభరణాలు నాకు అవసరం లేదు. అని అనుకుని ఆ మూటను దారిలోని ఒక చెట్టు కొమ్మకు తగిలించి, దానిమీద – “ఈ మూట బాటసారులకు ఎవరికి దొరికితే వారికే చెందుతుంది. వాళ్ళు దీన్ని నిస్సంకోచంగా వినియోగించుకోగలరు.” అని రాసిపెట్టాడు.

ఇంత విలువైన మూట ఎవరికి దొరికితే వాళ్ళు ధనికులైపోతారు, తమ అదృష్టానికి తామే మురిసిపోతారు. అనుకుంటూ ప్రమోదిత చిత్తంతో కొమ్మకు వేళ్ళాడుతున్న ఆ మూటను చూస్తూ ఉన్న ఉపాలి మనసులో ఒక ఆలోచన మెరుపులాగా మెరిసింది. అతడు, “ఈ సుఖ సంపదలతో కూడుకున్న ఈ రాజకుమారులు, కేవలం ఈ వస్త్రాలు, ఆభరణాలే కాకుండా రాజకుటుంబంలోని ఐశ్వర్యాన్ని, అధికారాన్ని, విలాసవైభవాలని త్యజించి భిక్షు జీవితం జీవించటానికి వెళుతున్నారు. అంటే ఆ సన్యాస జీవితంలో రాజవైభవం కంటే ఎంతో ఎక్కువ సుఖం ఉండవచ్చు. బుద్ధ భగవానుడు, కపిలవస్తులో ఉన్నన్ని రోజులూ ఆయన కీర్తి– ప్రశంసలనెన్నో విన్నాను. వారి మార్గం తప్పకుండా పరమసుఖ మార్గం అయి ఉంటుంది. కాబట్టి నేను కూడా ఇల్లూవాకిలి వదిలి ఈ మార్గాన్నే అనుసరించాలి.” అని ఆలోచించాడు.

అలా రాజకుమారులు త్యజించిన ఆ మూట మంగలి ఉపాలి మనసులో తీవ్రమైన ధర్మ–సంవేగాన్ని కలిగించింది. దానితో అతడు వెనుదిరిగి పరుగున వెళ్ళి ఆ ఆరుగురు రాజకుమారులను చేరుకున్నాడు. వారితో, “నేను కూడా మీతో పాటు బుద్ధ భగవానుని శరణు గ్రహిస్తాను. వారి ఆదేశాలను అనుసరిస్తూ భిక్షువు జీవితాన్ని జీవించి మానవ జీవితాన్ని సార్థకం చేసుకుంటాను.” అని వేడుకున్నాడు. దానితో రాజకుమారులు సంతోషించి, ఉపాలిని తమలో కలుపుకున్నారు. అందరూ కలిసి అనుపియా నగరంలో మల్లులచేత ఏర్పాటు చేయించబడిన విహారానికి చేరుకున్నారు. అక్కడే భగవానుడు భిక్షువులతో పాటు నివాసమున్నారు. అందరూ భగవానునికి నమస్కరించి ప్రవ్రజ్యాన్ని వేడుకున్నారు. భగవానుడు వారందరినీ ప్రవ్రజితులు చేయటానికి సిద్ధం కాగానే, ఆ ఆరుమంది రాజకుమారులు, “భగవాన్! మొదట మంగలి ఉపాలిని ప్రవ్రజితులు చేయండి, ఆ తరువాతనే మమ్మల్ని, మీరు అలా చేస్తే ప్రవ్రజిత జీవితంలో ఇతడు మాకంటే జ్యేష్ఠుడు, పూజ్యుడు అవుతాడు. భిక్షు నియమాల ప్రకారం మేము ఇతనికి తలవంచి నమస్కరించాలి. మాకు ఒకప్పటి సేవకుడైన మంగలికి తలవంచి నమస్కరిస్తేనే మాలోని అహంకారం కరిగిపోతుంది. భగవాన్! రాజకుమారులకెంతో గర్వముంటుంది, అందునా శాక్య వంశీకుల గురించి ఏమి చెప్పాలి? అన్నివర్ణాలలోనూ క్షత్రియులు శ్రేష్టమైన వారు, ఈ క్షత్రియుల్లో కూడా శుద్ధమైన రక్తం ప్రవహించే ఇక్ష్వాకు వంశీకులైన శాక్య క్షత్రియులు అత్యంత శ్రేష్ఠులు. మరి ఈ అభిమానం ఎలా కరిగిపోవాలి? అది అంతం కానంతవరకూ, ధర్మమెక్కడ? ముక్తి ఎక్కడ?” అని భగవానుని వేడుకున్నారు.

భగవానుడు చిరునవ్వుతో వారి మాటలు ఒప్పుకున్నారు. అలా ఈ శాక్యవంశ రాజకుమారుల ప్రవ్రజ్య జీవితంలో భిక్షువు ఉపాలి అగ్రుడయ్యాడు. ఆ తరువాతి కాలంలో భదంత ఉపాలి, భిక్షు నియమాల వినయ–క్షేత్రంలో భిక్షువులందరిలోనూ అగ్రుడయ్యాడు.

ఉపాలికి ఉపసంపద ప్రాప్తించిన తరువాత భగవానుని నుండి సాధనా విధిని నేర్చుకుని – “భంతే భగవాన్! నాకు అరణ్యావాస ఆజ్ఞనివ్వండి” అని భగవానుని వేడుకున్నాడు. సమాధానంగా భగవానుడు, “అరణ్యంలోకి వెళ్లి సాధన చేస్తే నీకు ఏకపక్షీయ (ఒకే కోణపు) జ్ఞానమే వృద్ధిచెందుతుంది. కానీ ఇక్కడే విహారంలో ఉంటూ సాధన చేయటంతో ఉభయపక్షీయ (రెండు కోణాల) జ్ఞానం పెరుగుతుంది. నీవు గ్రంథనిపుణతను మరియు

విపశ్యనా నిపుణత, అంటే పరియత్తి మరియు పటిపత్తి, అనగా ధర్మం యొక్క సైద్ధాంతిక పక్షం మరియు వ్యావహారిక పక్షం రెండింటిలోనూ నిపుణుడవుతావు. కాబట్టి అరణ్యంలోకి వెళ్ళకుండా విహారంలోనే ఉండు." అని ఆజ్ఞాపించాడు.

భిక్షువు ఉపాలి, భగవానుని ఆదేశం ప్రకారం ఆయన సాన్నిధ్యంలోనే ఉంటూ విపశ్యన సాధన చేస్తూ అర్హంత స్థితిని సాధించుకున్నాడు. దానితో పాటు భగవానుని వద్ద ఉంటూ భిక్షువుల కొరకు రూపొందించిన వినయశీలాలు, అంటే అనుశాసన నియమాలను గురించి పూర్తిగా తెలుసుకుని వాటిని పాటించాడు. భగవానుని ప్రముఖ శిష్యులలో ఉపాలి కూడా ఒకడయ్యాడు. ఉపాలి పొందిన ధర్మలాభం పట్ల సంతుష్టుడైన భగవానుడు, అతనిని వినయధర భిక్షువుల్లో సర్వశ్రేష్ఠుడిగా ప్రకటించి, అగ్ర ఉపాధినిచ్చి సన్మానించారు. పుట్టుకతో ఎవరూ ఉన్నత జాతికి లేదా అధమ జాతికి చెందినవారు కారు. తమ తమ కర్మలతోనే ఉత్తముడు, అధముడు; పెద్ద, చిన్నలు అవుతారు. ఈ విషయాన్ని కేవలం ఒక సిద్ధాంతం లాగా స్వీకరించటం సులభమే, కానీ దానిని ఆచరణలో పెట్టటం కఠినమైన పని. సద్ధర్మ మార్గంలో ప్రయాణించే వ్యక్తి దానిని ఆచరిస్తాడు. పుట్టుకతో శూద్రునిగా పరిగణించబడే ఉపాలి, తన కర్మల ద్వారా బ్రాహ్మణుడు అయ్యాడు. జ్యేష్టుడు – శ్రేష్టుడు అయ్యాడు. పావనుడు – పూజ్యుడు అయ్యాడు.

అటువంటి మహాస్థవిర ఉపాలి ఒకానొక హర్షోల్లాస సమయంలో ఇలా చెప్పాడు –

***"సద్ధాయ అభినిక్ఖమాయ నవపబ్బజితో నవో!***
***మిత్తే భజేయ్య, కల్యాణో సుద్ధాజీవో అతన్దితో!!"***

శ్రద్ధాపూర్వకంగా ఇల్లూవాకిలి విడిచిపెట్టిన వివేకులైన యువ ప్రవ్రజితులు, సోమరితనం లేకుండా, శుద్ధమైన ఆజీవికతతో కూడిన జీవితాన్ని జీవిస్తుండే కళ్యాణమిత్రునితో సాంగత్యం చేయాలి.

***"సద్ధాయ అభినిక్ఖమాయ నవపబ్బజితో నవో!***
***సంఘస్మిం విహరం భిక్ఖు సిక్ఖేథ వినయం బుధో!!"***

– శ్రద్ధాపూర్వకంగా ఇల్లూవాకిలి విడిచిపెట్టిన వివేకులైన యువ ప్రవ్రజితులు, భిక్షు సంఘంలో ఉంటూ వినయనియమాలను నేర్చుకోవాలి.

***"సద్ధాయ అభినిక్ఖమాయ నవపబ్బజితో నవో!***
***కప్పాకప్పేసు కుసలో చరేయ్య అపురక్ఖతో!"***

– శ్రద్ధాపూర్వకంగా ఇల్లూవాకిలి విడిచిపెట్టిన వివేకులైన యువ ప్రవ్రజితులు, తాను చేయదగిన పనులను, చేయకూడని పనులను అర్థం చేసుకుంటూ, వాటిని ఆచరణలో పెడుతూ ధర్మాన్ని ఆచరించాలి.

మహాస్థవిర ఉపాలి, యువవయస్సులో శ్రద్ధతో ఇల్లూవాకిలి విడిచిపెట్టి బుద్ధ భగవానుని వంటి కళ్యాణమిత్రుని సాన్నిధ్యంలో సంఘారామంలో గడిపాడు. అలా సంఘారామంలో ఉంటూ భిక్షునియమాలను చక్కగా నేర్చుకుని నిష్ఠతో ధర్మాన్ని ధారణ చేసి ముక్తిని పొందాడు. ఈ విషయాన్నే అర్హంత ఉపాలి, పైన తెలిపిన హర్షోద్గారాల రూపంలో ఇతరులకు వ్యక్తపరిచాడు.

శాక్యరాజకుమారుల చేత త్యజించబడిన దుస్తులు, ఆభరణాల మూట మంగలి ఉపాలికి ధర్మ–ధారణకు అవసరమయిన ప్రేరణకు కారణమయింది. తన దుఃఖాల నుండి ముక్తుడైన మహాస్థవిర ఉపాలి యొక్క ఉల్లాసభరితమైన వాణి ఎంతోమందిలో ప్రేరణ కలగటానికి కారణమవ్వాలి. ఇందులోనే మంగళము, కళ్యాణము ఇమిడి ఉంది.

**– కళ్యాణమిత్రుడు**
**– సత్యనారాయణ గోయంకా.**


రెండు సంవత్సరాలకు చందా రూ 100/– **విపశ్యన తెలుగు మానపత్రిక** జీవిత చందా రూ. 500/–
ప్రచురణ తేది: ప్రతినెల 30/31 పోస్టింగ్ తేది: ప్రతి నెల 1/2 వెల: రూ 5/–
**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**
**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**


If Undelivered please return to :
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam.
Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.